ట్రాఫిక్ పద్మవ్యూహం..

తెలంగాణ చౌరస్తాలో నియంత్రణ వ్యవస్థ లేని ఫలితం

చొప్పదండి పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించే వ్యవస్థ లేక ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు

చొప్పదండి, ఫిబ్రవరి 26 : పట్టణంలోని ప్రధాన కూడలి తెలంగాణ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. వాహనాల రాకపోకలు నియంత్రించే వ్యవస్థ లేక ప్రమాదాలకు నెలవవుతున్నది. చౌరస్తాకు ప్రతి రోజు చొప్పదండి మండలంలోని గ్రామాల నుంచే కాకుండా రామడుగు, జూలపల్లి, ధర్మారం మండలాల్లోని దాదాపు 25 గ్రామాల నుంచి ప్రజలు వివిధ పనుల మీద వస్తుంటారు. ఇక్కడికి దగ్గరలోనే బ్యాంకులు, ఇతర దుకాణాలతో పాటు వ్యవసాయ మార్కెట్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉండగా, ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. చౌరస్తాలోనే కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు, ధర్మారం, లక్షెటిపేట వైపు వెళ్లే బస్సులు నిలిపే దగ్గరే, ఆటోలు కూడా ప్రయాణికుల కోసం రోడ్డు మీదనే నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతున్నది. అలాగే, బస్సులు కూడా రెండు వైపులా ఎదురు ఎదురుగా దగ్గరగా ఆపి ఉంచడం వల్ల రోడ్డుపై ఇతర వాహనాలు వెళ్లలేక తరచూ ట్రాఫిక్ నిలిచిపోతున్నది. పండుగల రోజుల్లో అయితే వివిధ రకాల సరుకులు, పండ్లు, పూలు కొనుక్కునేందుకు వచ్చే వారితో రద్దీ మరింత పెరుగుతున్నది. ఇప్పటికైనా పోలీస్‌లు తెలంగాణ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుల్‌ను నియమించి ఎప్పటికప్పుడూ ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని పట్టణప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

నగరంలోని సప్తగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

'పది' పరీక్షలకు సమాయత్తం

- వార్షిక పరీక్షలకు మిగిలింది 21 రోజులే..
- స్టడీఅవర్లు, నమూనా పరీక్షల్లో విద్యార్థులు
- ప్రత్యేక దృష్టిసారించిన కలెక్టర్

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 26 : పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో యంత్రాంగం సంబంధిత ఏర్పాట్లలో నిమగ్నమైంది. అలాగే వంద శాతం ఫలితాల సాధన దిశగా విద్యార్థులను చదువులో ప్రోత్సహిస్తున్నది. ఈ మేరకు విద్యార్థులంతా స్టడీ అవర్లలో తలమునకలవుతూ, నమూనా పరీక్షలు, ప్రీ ఫైనల్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మార్చి 21 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండగా, మార్చి 6వ తేదీ నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

జిల్లాలో 12,641 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా, అందుకు తగిన ఏర్పాట్లు సైతం అధికారులు పూర్తి చేస్తున్నారు. పరీక్షల విషయంలో ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత ఉండాలని, విద్యాసంవత్సరం ప్రారంభమైన నాటి నుంచే అధికారులకు సూచిస్తున్నారు. ఈ క్రమంలో పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారన్న కోణంలో ఇప్పటికే అధికారులతో రివ్యూలు నిర్వహిస్తున్నారు.

మారిన పరీక్ష నమూనా..

10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నమూనాలో, మార్కుల విధానంలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసింది. గతంలో 10వ తరగతిలో 20 ఇంటర్నల్ మార్కులు, 80 మార్కులకు ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం 100 మార్కులకు ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఈ నూతన విధానం అమల్లోకి రానుండగా, ఈ పరీక్ష విధానంపై ఇప్పటికే విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా, విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్ అందజేస్తారు. సైన్స్‌లో జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం పేపర్లకు 12 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. అయితే, గతంలో విద్యార్థులకు విడి పేపర్లు ఇచ్చి, అవసరం ఉన్న వారికి అడిషనల్ షీట్లు అందజేసేవారు. ఆన్సర్లు రాసి పేపర్లను కూర్చి, దారం కట్టాల్సి వచ్చేది. ఈ విదానానికి స్వస్తి చెప్పి ఇక నుంచి కేవలం బుక్‌లెట్ మాత్రమే ఇవ్వనున్నారు.

ప్రిపరేషన్ ప్లాన్ తప్పనిసరి..

- విద్యార్థులు మిగిలిన రోజులను ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించుకుని పరీక్షలకు ప్రిపేర్ కావాలి. ఇందులో సిలబస్‌లో ఆయా సబ్జెక్టు, చాప్టర్లు పరిశీలించాలి.
- ముఖ్యమైన చాప్టర్లను వెయిటేజీ ఆధారంగా వర్గీకరించుకోవాలి. అత్యధిక వెయిటేజీ ఉండే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- ఇప్పటి నుంచే ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు పెంచుకోవాలి.
- మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి బేసిక్ విషయాలు బాగా అధ్యయనం చేయాలి.
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించేలా ప్రాక్టీస్ చేయాలి.
- అందమైన చేతిరాత, వేగంగా రాసేలా సాధన చేయాలి. అలాగే పదాలు, పేరాల మధ్య తగినంత నిడివి పాటించాలి.
- అక్షరదోషాలు లేకుండా సరిచూసుకోవాలి. మొదటి వరుసలో ఎంత బాగా రాశామో చివరి వరకు చేతి రాతను అలాగే కొనసాగించాలి.

- ***రోడ్డుపై మురుగు పరుగు***

మధురానగర్‌లో రోడ్డు మీదే పారుతున్న మురుగు నీరు

గంగాధర మండలం మధురానగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వేములవాడ రోడ్డులో రోడ్డు మీదే మురుగు నీరు పారుతుండడంతో దుర్వాసన వచ్చి ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వీధిలో డ్రైనేజీ లేకపోవడంతో ఇండ్లల్లోని వృథా నీరు సీసీరోడ్డు మీదికి వస్తోంది. గ్రామ పంచాయతీ అధికారులు ఇంకుడు గుంతల నిర్మాణంపై గ్రామస్తులు అవగాహన కల్పించకపోవడంతో గ్రామస్తులు ఎవరూ ఇంకుడు గుంత నిర్మించుకోకపోవడం, దీనికి తోడు డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై చేరుతున్నది. ఫలితంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండగా, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

-గంగాధర, ఫిబ్రవరి 26

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల సంఘం
- జిల్లాలో 103 పోలింగ్ కేంద్రాలు

పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి స్థానాల పోరు నేడు జరుగనున్నది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనున్నది. జిల్లాలో మొత్తం 71,545 మంది పట్టభద్ర ఓటర్లు, 4,305 మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు. వీరంతా మండలి బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యాన్ని నేడు నిర్ణయించబోతున్నారు. ఈ రెండు స్థానాల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా జిల్లాలో 103 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఇందులో పట్టభద్రుల కోసం 85, ఉపాధ్యాయుల కోసం 18 పీఎస్‌లు ఉన్నాయి. రెవెన్యూ డివిజన్ల వారీగా పరిశీలిస్తే కరీంనగర్ పరిధిలో 69 గ్రాడ్యుయేట్, 12 టీచర్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. హుజూరాబాద్ పరిధిలో పట్టభద్రుల కోసం 16, ఉపాధ్యాయుల కోసం 6 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో విధుల నిర్వహణ కోసం 103 మంది ప్రిసైడింగ్ అధికారులు, 312 మంది పోలింగ్ అధికారులు, 36 మంది రిజర్వు సిబ్బంది, 451 మంది సిబ్బంది ఎన్నికల విధుల నిర్వహణలో పాలుపంచుకోనుండగా, వీరి విధులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు 36 మంది మైక్రో అబ్జర్వర్లు, 12 మంది సెక్టార్ అధికారులను ఎన్నికల సంఘం నియమించింది. పోలింగ్ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో గల రిసెప్షన్ కేంద్రానికి తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటేయాలి : ఆర్వో పమేలా సత్పతి

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ ఆఫీసర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం మధ్యాహ్నం ఆర్వో సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న పీవోలు, సిబ్బంది, ఇతర అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్‌పై రూట్ అధికారులతో చర్చించారు. బ్యాలెట్ బాక్సుల లాకింగ్ విధానం, సీలింగ్‌పై మరోసారి అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పోలింగ్ సిబ్బందికి సామగ్రి అందించాలన్నారు. చెక్‌లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందిందా.. లేదా..? అన్నది పంపిణీ కేంద్రం నుంచే వెళ్లే ముందే సరి చూసుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బందిని తరలించే వాహనాలు కూడా పరిశీలించి, నిర్దేశించిన సమయంలోపే వారిని పోలింగ్ కేంద్రాలకు చేర్చేలా పర్యవేక్షించాలంటూ రూట్ అధికారులను ఆదేశించారు. రిటర్నింగ్ అధికారితోపాటు అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో కే మహేశ్వర్, ఇతర జిల్లా అధికారులు పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించిన వారిలో ఉన్నారు.

హుజూరాబాద్ టౌన్: పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ సమ్మయ్య



గంగాధరలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాము

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 26: కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్నికల అధికారులు హుజూరాబాద్ పట్టణంలో పూర్తి చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఐదు పోలింగ్ బూత్‌లు, టీచర్స్ ఎమ్మెల్సీ కోసం ఒక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. హుజూరాబాద్‌లో మొత్తం పట్టభద్రుల ఓట్లు 5393 ఉండగా, టీచర్ల ఓట్లు 278 ఉన్నాయి. గురువారం ఉదయం పోలింగ్ ఏజెంట్ల మధ్య మాక్ పోలింగ్ నిర్వహించి ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. బుధవారం పోలింగ్ కేంద్రమైన పట్టణంలోని బాలికల పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులు తమకు కేటాయించిన గదుల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. పోలింగ్ ఏజెంట్ల నుంచి వివరాలను తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల గౌడ్ పోలీస్ సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు.

గంగాధర, ఫిబ్రవరి 26 : ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో రాము తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, గంగాధర మండలంలో 2934 మంది పట్టభద్రులు, 110 మంది టీచర్లు ఉన్నట్లు తెలిపారు. పట్టభద్రుల కోసం 3, టీచర్స్ కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పట్టభద్రులు, టీచర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఇక్కడ చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్, ఎస్ఐ నరేందర్‌రెడ్డి, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

హుజూరాబాద్ టౌన్: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

చెట్లు ఎండిపోయి కళతప్పిన రామకృష్ణకాలనీ పల్లె ప్రకృతి వనం

ప్రకృతి వనం.. ఆహ్లాదం మాయం

- ఎండుతున్న మొక్కలు, చెట్లు
- సంరక్షణ మరిచిన అధికారులు

మారుతున్న కాలానుగుణంగా పల్లెలు పట్టణీకృతం అవుతున్న నేపథ్యంలో పల్లె వాసులకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించేందుకు గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ పల్లెపల్లెనా ప్రకృతి వనం ఏర్పాటు చేయించారు. కొద్ది రోజులు పల్లెల్లో పచ్చదనంతో కళకళలాడిన పల్లె ప్రకృతి వనాలు నేడు సరైన నిర్వహణ లేక ఎండిపోయి వికృతంగా కనిపిస్తున్నాయి. మొక్కలు, చెట్ల సంరక్షణను పట్టించుకునేవారే కరువయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తిమ్మాపూర్, ఫిబ్రవరి 26: మండలంలోని అన్ని గ్రామాల్లో మూడేండ్ల క్రితం ఉపాధి హామీ పథకం కింద 20గుంటల నుంచి ఎకరం ప్రభుత్వ భూమిలో గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది కేసీఆర్ ప్రభుత్వం. అందులో త్వరగా ఫలాలను అందించే జాతులైన జామ, సీతాఫలం, దానిమ్మ తదితరుల పండ్లు, పూల మొక్కలను నాటించారు.

కన్నెత్తిచూడని అధికారులు

ప్రకృతి వనంలో మొక్కలు నాటిన నాటి నుంచి రెండు సంవత్సరాలు ఉపాధి హామీ పథకం సిబ్బంది ద్వారా నిర్వహణ చేపట్టిన అధికారులు.. ప్రస్తుతం వాటి వైపు కన్నెత్తి చూడకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. మరి కొద్దిరోజుల్లో పండ్లు చేతికి వచ్చే దశలో చెట్లు మోడుబారుతున్నాయి. అయితే ఇప్పటి వరకు ఉపాధి హామీ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగించగా.. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు నిర్వహణ చేయాల్సి ఉందని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. ఏదైమైనా ప్రస్తుతం వేసవి వస్తున్న నేపథ్యంలోనైనా అధికారులు స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎండుతున్న చెట్లు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలు..!

ప్రకృతి కోసం ఏర్పాటు చేసిన వనాలు కొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాల్లో మద్యం ప్రియులు రాత్రివేళల్లో మద్యం తాగుతున్నారు. అధికారులు పర్యవేక్షణ పెంచాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

ఇసుక వాహనాల పట్టివేత

వీణవంక, ఫిబ్రవరి 26: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్ఐ తోట తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోర్కాళ్ గ్రామానికి చెందిన కొలిపాక శ్రీధర్ ట్రాక్టర్‌లో, నర్సింహులపల్లి గ్రామానికి చెందిన సుద్దాల దేవుడు ట్రాలీలో మానేరువాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా కనపర్తి గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న కొలిపాక శ్రీధర్, సుద్దాల దేవుడుపై కేసు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఎవరు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి దుర్మరణం

గన్నేరువరం, ఫిబ్రవరి 26: జంగపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు ముత్యం ధర్మయ్య గౌడ్ (59) ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడడంతో మృతి చెందినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ధర్మయ్య గౌడ్ జంగపల్లి, పీచుపల్లి గ్రామాల మధ్య గల కొత్త తాటిచెట్ల వద్దకు వెళ్లాడు. ఒక తాటిచెట్టు ఎక్కి చుట్టూ పూర్తి చేసి అనంతరం మరొక చెట్టు పైకి ఎక్కి సగం వరకు వెళ్లి చుట్టుపడుతుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. అతడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ధర్మయ్యగౌడ్‌కు కుమారుడితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బీసీల పల్లెబాట విజయవంతం చేయాలి

పోస్టర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం, ఫిబ్రవరి 26: బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన 'పల్లెబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. ఈ మేరకు బుధవారం కరీంనగర్ ఆయన స్వగృహంలో పల్లెబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ, గ్రామ గ్రామాన బీసీల చైతన్యం, ఐక్యత కోసం పల్లెబాట నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. జనాభాలో బీసీల వాటాపై జరుగుతున్న పల్లెబాట కార్యక్రమం బీసీలను కదిలించడానికి ఎంతో ఉపయోగపడుతుందని, బీసీలు, ప్రజా సంఘాలు, అంబేద్కర్ వాదులు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ, జనాభాలో సగభాగమైన బీసీలు బీసీల హక్కుల సాధన అభివృద్ధి కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి బీసీ భాగస్వామ్యమవుతున్నారని, ప్రతి పల్లెను కదిలించడమే లక్ష్యంగా పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుడికి గుండెపోటు

- **సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడిన ఎస్ఐ**

ఓదెల, ఫిబ్రవరి 26: మహా శివరాత్రి సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుకు గురికాగా, పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేశ్ సీపీఆర్ ద్వారా అతడి ప్రాణాలను కాపాడాడు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన ఒరుసు శ్రీనివాస్ బుధవారం మల్లన్న ఆలయానికి వచ్చాడు. మహాశివరాత్రి కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉన్నది. ఈ క్రమంలో శ్రీనివాస్ అకస్మాత్తుగా కింద పడిపోయాడు. ఆలయంలో బందోబస్తు విధుల్లో ఉన్న ఎస్ఐ రమేశ్ ఈ విషయాన్ని గమనించారు. శ్రీనివాస్ గుండెపోటుకు గురైనట్లు గుర్తించిన ఎస్ఐ.. సీపీఆర్ చేసి అతడి ప్రాణాలు కాపాడారు. అక్కడి నుంచి ఎస్ఐ తన వాహనంలో స్థానిక దవాఖానకు తరలించి, చికిత్స అందించారు. సకాలంలో స్పందించి సీపీఆర్ చేసిన ఎస్ఐని పలువురు అభినందించారు.

పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 26: పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం కొత్తూరు మల్లయ్య అధ్యక్షతన బుధవారం పట్టణంలోని సీఐటీయూ హమాలీ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించకుంటే దశలవారీగా పోరాటాలకు సన్నద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో రెండు నుంచి ఐదు నెలల వరకు పంచాయతీ కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ రావు, ఎలుకపెల్లి సారయ్య, మహంకాళి కొమురయ్య, కాశిపాక శంకర్, వడ్లూరి లక్ష్మీనారాయణ, మొలుగూరి ప్రేమ్ కుమార్, గంధసిరి సంపత్, సమ్మయ్య, చంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: కొండన్నపల్లి సహస్రలింగేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

భక్తి శ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు



నగరంలోని పాతబజార్ శివాలయం వద్ద భక్తుల బారులు

కమాన్‌చౌరస్తా/తిమ్మాపూర్/శంకరపట్నం/ చొప్పదండి/ ఇల్లందకుంట/ వీణవంక/ సైదాపూర్/ హుజూరాబాద్ టౌన్/ చిగురుమామిడి/ మానకొండూర్ రూరల్/ గంగాధర/కరీంనగర్ రూరల్/రామడుగు, ఫిబ్రవరి 26 : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా శైవాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తులు హరహర మహదేవ.. శంభో శంకర.. అంటూ గరళకంఠుడైన శివుడిని ఆరాధించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. పాత బజారులోని శ్రీ గౌరీశంకర ఆలయంలో, కమాన్ సమీపంలోని శ్రీరామేశ్వరాలయంలో, భగత్‌నగర్ భవానీ శంకరాలయంలో, శ్రీహరినగర్‌లో వీరాంజనేయ శివాలయంలో, భగత్‌నగర్ హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో, అల్గునూర్‌లో పురాతన శివాలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివకల్యాణం జరిపించగా, తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని మృత్యుంజయ స్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు చేశారు. శంకరపట్నం మండలం చింతలపల్లి శ్రీభ్రమరాంబికా-మల్లికార్జున స్వామి, మానకొండూర్ మండలం గంగిపల్లి శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయాలను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించారు. కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి గుట్టపై బుధవారం తెల్లవారు జామున ఏర్పాటు చేసిన అగ్నిగుండాలపై నడిచి పలువురు భక్తులు తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. సైదాపూర్ మండలం బొమ్మకల్ రాజరాజేశ్వరాలయం, గుజ్జులపల్లి పంచలింగ దేవాలయంతో పాటు చిగురుమామిడి మండల కేంద్రంలోని పార్వతీ పరమేశ్వర ఆలయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రేకొండ గౌరీశంకర్ ఆలయంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. గంగాధర మండలం కొండన్నపల్లి సహస్ర లింగేశ్వరాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వీణవంక మండల కేంద్రంలోని శివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సైకతశిల్పం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కరీంనగర్ రూరల్ మండలం చెర్లభూత్కూర్‌లోని చెన్నకేశవ దేవాలయంలో 116 కలశాలతో శివలింగానికి ప్రత్యేక అభిషేకం చేశారు. రామడుగు మండలం వెలిచాల సోమేశ్వర దేవాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ఆది దంపతుల కల్యాణం కనుల పండువగా జరిపించారు. రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు, కవిత దంపతులు, వెలిచాల మాజీ సర్పంచ్ వీర్ల సరోజన, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నార్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.